నేటి దినపత్రిక
సూర్య
17 వ వసంతంలోకి
ఎన్టీఆర్ - కృష్ణా

సోమవారం 13 మే 2024 పేజీలు 8

## 13 రకాల గుర్తింపు కార్డులు చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు

జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : ఓటర్లు తమ ఓటు వేసుకునేందుకు 13 రకాల గుర్తింపు కార్డులు చూపించి వారి ఓటును వేసుకోవచ్చని జిల్లా ఎన్ని కల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గ దర్శకాల ప్రకారం ఈనెల 13వ తేదీన ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల లోగా ఓటరు గుర్తింపు కార్డు గాని లేదా ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం ,డ్రైవింగ్ లైసెన్సు, ఉపాధి హామీ జాబ్ కార్డు, పాన్ కార్డు, ఇండియన్ పాస్పోర్ట్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, స్మార్ట్ కార్డు, పెన్షన్ కార్డు, ఎంపీ ఎమ్మెల్యే ఎమ్మెల్సీలకు జారీచేసిన అధికారిక గుర్తింపు కార్డులు, సామాజిక న్యాయం సాధికారత శాఖ వారిచే జారీచేసిన ప్రత్యేక దివ్యాంగుల గుర్తింపు కార్డులు, ఉద్యోగుల గుర్తింపు కార్డు లలోఏదైనా ఒకటి చూపించి ఓటు హక్కు వినియోగించు కోవచ్చని కలెక్టర్ వివరించారు. ప్రజాస్వామ్య పండుగలో ఓటు హక్కు ఎంతో విలువైనదని ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు హక్కు అవకాశం వినియోగించుకొని మన దేశానికి మన వంతు భాగస్వామ్యం అందించాలన్నారు.

## పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఆదివారం కలెక్టరేట్లో వెబ్ క్యాస్ట్ కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం కలెక్టర్ కంట్రోల్ రూమ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1768 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, అందులో 364 పోలింగ్ కేంద్రాలు క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు, పోలింగ్ తీరు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు, ఇందుకోసం కలెక్టరేట్లో వెబ్ క్యాస్ట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్, కలెక్టరేట్ ఆవరణలో డీఈవో కార్యాలయం మీటింగ్ హాల్లో ఏర్పాటుచేసిన ఫిర్యాదుల పరిష్కార విభాగాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షిస్తూ పోలింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు తెలియచేసేందుకు కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ నందు మీడియా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అనుకోని సంఘటన జరిగినప్పుడు, మీడియాలో వచ్చిన సంఘటనలకు వెంటనే స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలింగ్ సందర్భంగా ఎన్నికల ఫిర్యాదుల పరిష్కార విభాగం అప్రమత్తంగా ఉండాలని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి టీములను అప్రమత్తం చేయాలన్నారు. మద్యం, ప్రలోభాలు పంపిణీ అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె.చంద్రశేఖరరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## చల్లపల్లిలో మోడల్ మహిళా పోలింగ్ స్టేషన్, మోడల్ పోలింగ్ స్టేషన్లు

చల్లపల్లి మేజర్ న్యూస్ చల్లపల్లిలో మెడల్ మహిళా పోలింగ్ స్టేషన్, మోడల్ పోలింగ్ స్టేష న్లను ఏర్పాటుచేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఎమ్మార్సీ సెంటర్లో 72వ బూత్ను మోడల్ మహిళా (పింక్)పోలింగ్ స్టేషన్గా ఏర్పాటుచేయగా, పోలింగ్ స్టేషన్ బయట స్వాగత హోర్డింగులు ఏర్పాటుచేసి పింక్ బెలూన్లతో అలంకరించారు. పోలింగ్ స్టేషన్ను తహసీల్దార్ బి.సుమతి ప్రారంభించారు. ఈ బూత్లో పురుషుల కంటే స్త్రీలు ఎక్కువమంది ఉన్నారు. పురుషులు 629 మంది ఉండగా, స్త్రీలు 713 మంది ఉన్నారు. స్థానిక పొట్టి శ్రీరాములు వీధిలోని రామలింగయ్య పాఠశాలలో 71వ పోలింగ్ స్టేషన్ ను మోడల్ పోలింగ్ స్టేషన్గా ఏర్పాటు చేశారు. చల్లపల్లి మండలంలో మొత్తం 50 పోలింగ్ బూత్లు ఉండగా, ఒక్కో బూత్లో పీవో, ఏపీవో, నలుగురు ఓపీవోలు విధులు నిర్వహిస్తారు. వీరితోపాటు బీఎల్వో, మైక్రో అబ్జర్వర్, వెబ్ కెమేరా సాంకేతిక నిపుణుడు, పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారు. మండలానికి ముగ్గురు సెక్టార్ ఆఫీసర్లు, ముగ్గురు రూట్ ఆఫీసర్లు పనిచేస్తారు.

చల్లపల్లి సర్కిల్ పరిధిలో 132 మంది పోలీసులు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి చల్లపల్లి సర్కి ల్లో 132 మంది పోలీసులు విధులు నిర్వహించ నున్నట్లు చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్ తెలిపారు. డీఎస్పీ ఒకరు. ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, ఏఎస్ఐలు. హెడ్కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ సహా 132 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారనీ, వీరు కాకుండా ఎన్సీసీ వాలంటీర్ల సేవలు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. డీఎస్పీ ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ స్ట్రైకింగ్ ఫోర్స్, మండలానికి ఐదు రూట్ మొబైల్స్ పనిచేస్తాయన్నారు.




## రాజకీయ నాయకులకు సత్కారం

మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : ఆదివారం మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి ఎమ్మెల్యే అభ్యర్థి కొల్లు రవీంద్ర జనసేన నాయకులు బండి రామకృష్ణ బిజెపి నాయకులు పంతం వెంకట గజేంద్రరావును వాసవి కన్యకా



పరమేశ్వరి దేవస్థానములో ఆర్యవైశ్య ప్రముఖులు ఆలయ మర్యాదలతో సత్కరించి విజయం అభినందనలు తెలియజేశారు.

## వేసవి దాహార్తి ని తీర్చుటకై మజ్జిగ పంపిణీ

గన్నవరం,ఏప్రిల్27,మేజర్‌న్యూస్:శనివారం ఉదయం 11 గంటలకు గన్నవరం వాస్తవ్యులు తాడికొండ నాంచారయ్య, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్ వరలక్ష్మి మెటల్ స్టోర్స్ దగ్గర మజ్జిగ



పంపిణీ, అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ప్రార్థన మందిరం, వాసవి క్లబ్ గన్నవరం మిత్ర వారి ఆధ్వర్యంలో వేసవి దాహార్తిని తీర్చుటకై మజ్జిగ పంపిణీ సేవా దాతల సహకారంతో చేయు చున్నామని కమిటీ సభ్యులు తెలియజేసినారు.

## కౌంటింగ్ కేంద్రాన్ని డీకే బాలాజీ,జాన్ కింగ్స్ లే పరిశీలన

మచిలీపట్నం,మేజర్‌న్యూస్ : సాధారణ ఎన్నికలకు సంబంధించి కృష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, మచిలీపట్నం పార్లమెంటు సాధారణ పరిశీలకులు జాన్ కింగ్స్ లే తో కలిసి ఆదివారం సందర్శించి వివిధ నియోజకవర్గాలకు ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూములు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు పరిశీలించారు. ఈనెల 13వ తేదీ పోలింగ్ పూర్తయ్యాక ఈవీఎంలను కృష్ణ విశ్వవిద్యాలయంలో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించిన స్ట్రాంగ్ రూములలో భద్రపరిచేందుకు ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వాతావరణ కేంద్రం నుండి వర్ష సూచన ఉన్నందున వర్షం వచ్చినప్పటికీ ఇబ్బందులు కలుగకుండా వాటర్ ప్రూఫ్ షామ్యానాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్ట్రాంగ్ రూములకు ఈవీఎంలు తరలించేందుకు అసెంబ్లీల వారీగా వేరువేరు మార్గాలు ఏర్పాటుకు అవసరమైన బార్కేడింగ్ పనులు కలెక్టర్ పరిశీలించారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కు సంబంధించి పార్లమెంటు, అసెంబ్లీ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాగా, వీటన్నిటిని అనుసంధానించి ఏర్పాటుచేసిన టీవీలలో కలెక్టర్ వీక్షించారు. ఎన్నికల పరిశీలకులు కూడా వీక్షించేందుకు ఏర్పాట్లు చేయాలని, అదేవిధంగా అభ్యర్థులు వారి ప్రతినిధులు పరిశీలించేందుకు డిస్ప్లే రూముల్లో ఏర్పాటుచేసిన టీవీలు కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ అనంతరం వచ్చే వాహనాలు పార్కింగ్ స్థలాల్లో వర్షం కారణంగా ఇబ్బందులు ఏర్పడకుండా క్వారీ డస్ట్ తో పటిష్టపరచినట్లు, అదేవిధంగా తగిన కృష్ణా విశ్వవిద్యాలయం ఆవరణ, పార్కింగ్ స్థలాలు, రిసెప్షన్ కేంద్రాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది తిరిగి వారి ఇళ్లకు వెళ్లేందుకు కేయూ వద్ద తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేసి, ఆయా రూట్లలో బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. డిఆర్వో కె చంద్రశేఖర రావు, ఏడి సర్వే మనిషా త్రిపాఠి, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయకుమారి, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, ఆర్ అండ్ బి అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.





## కంచికచర్ల ఒకే ఒక్కడు గద్దె ప్రసాద్ మృతి

కంచికచర్ల, మేజర్‌న్యూస్: కంచికచర్ల ఒకే ఒక్కడుగా పేరుగాంచిన మాజీ సర్పంచ్, శ్రీ శివ సాయి క్షేత్రం,ముక్త్యాల కోటిలింగాల హరి హర మహా క్షేత్రం వ్యవస్థాపకులు గద్దె ప్రసాద్ (62) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ ఆదివారం తుది శ్వాస విడిచారు. ప్రసాద్ కు భార్య ఇరువురు కుమార్తెలు ఉన్నారు. కంచికచర్ల సొసైటీ అధ్యక్షు డిగా,



గ్రామ సర్పంచిగా ఈ ప్రాంతంలో మంచి పేరు తెచ్చుకున్నారు. కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట పరిసర ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో విశేష అనుభవం గడించి, ఎందరికో జీవనోపాధి కల్పించారు. జగ్గయ్యపేటలో పి ఐ టి ఏస్ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటులో క్రియాశీల భూమిక పోషించారు. ఎన్నో దేవాలయాలకు భూ విరాళాలు అందజేసారు. అన్నదానాలు చేయటంలో ఆయనకు ఆయనే సాటి. చేయి చాచి అడిగినవారికి లేదనకుండా తన వంతు సాయం చేసి ఎందరినో ఆదుకున్నాడు. గద్దె ప్రసాద్ కొంత కాలంగా అనారో గ్యంతో బాధపడుతూ విజయవాడ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం తుది శ్వాస చెందాడు. ప్రసాద్ మాతృమూర్తి గద్దె సరస్వతి కూడా కంచికచర్ల గ్రామ సర్పంచిగా పనిచేసి గ్రామ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారు. మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు మల్లెల పుల్లయ్యబాబు, మాజీ జెడ్పిటిసి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కోగంటి బాబు, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు అల్లడి కోటేశ్వరరావు తదితరులు గద్దె ప్రసాద్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.